క్లుప్తంగా

గురుకులం ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల ఖమ్మం బాలికలు -1 నందు వచ్చే విద్యా సంవత్సరానికి(2024-2025) 5వ తరగతిలో ప్రవేశానికి మైనారిటీ, నాన్ మైనారిటీ విద్యార్థినులు, 6 నుంచి 8వ తరగతుల్లో ప్రవేశానికి మైనారిటీ విద్యార్థినులు ఈ నెల18వ తేదీ నుంచి ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ స్వాతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో లేదా టీఎంఆర్ ఈఐఎస్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ తెలియజేశారు. వివరాలకు 7331170860 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఖమ్మంరూరల్: తెలంగాణా మైనార్టీ గురుకుల నేలకొండపల్లి పాఠశాల, జూనియర్ కళాశాల బాలురకు 2024-25 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ మొదటి సంవత్సరం, 5, 6, 7, 8 తరగతుల్లో మిగిలిపోయిన బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి, మైనార్టీ విద్యార్థులకు మాత్రమే ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 6లోగా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

నేటి నుంచి న్యాయవాదులకు ఆటల పోటీలు

ఖమ్మం లీగల్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం బార్ అసోసియేషన్ క్రీడా కార్యదర్శి రావుల వెంకట్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి న్యాయవాదులకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రీడా పోటీలు శుక్రవారం కబడ్డీ, వాలీబాల్, చెస్, 21న క్రికెట్, 22న బాల్ బ్యాడ్మింటన్, షటిల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ బి.తావుర్యా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైరారోడ్, జెడ్పీ సెంటర్ ఏరియా, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, రిక్కాబజార్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందనే విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

ఇంటిపన్ను వసూళ్లకు స్పెషల్‌డ్రైవ్

రఘునాథపాలెం: మండలంలోని గ్రామపంచాయతీల్లో ఇంటిపన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ ప్రారంభించారు. ఇంటిపన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలంటూ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. మండలంలోని 40 జీపీల్లో రూ.95 లక్షలకు గాను రూ.36 లక్షలే వసూలు కావడంతో మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యాన కార్యదర్శులకు సూచనలు చేస్తున్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పన్నులు చెల్లించాలని ఎంపీఓ కోరారు.

ఉచిత వైద్యశిబిరం

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్లలో గ్రేస్ సొసైటీ ఆధ్వర్యాన గురువారం ఉచిత మొబైల్ హెల్త్ క్యాంప్ ఏర్పాటుచేశారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ ధారా శ్యాం ప్రారంభించగా 200 మందికి పైగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కుర్రా భాస్కరరావు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

డిప్లొమా ఫలితాల్లో ప్రభంజనం

ఖమ్మంరూరల్: డిప్లొమా ఫలితాల్లో మండలంలోని పొన్నేకల్‌కు చెందిన చైతన్య ఇంజనీరింగ్ డిప్లొమా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పన్నాల కృష్ణమూర్తి తెలిపారు. ఇద్దరు పదికి పది జీపీఏ సాధించగా 38 మంది విద్యార్థులు 9 జీపీఏ సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతిక, శ్రీవిద్య తదితరులు అభినందించారు.

అక్షింతలు పంపిణీ

కామేపల్లి: అయోధ్య రామ మందిరం నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని రుక్కితండా గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, బానోత్ నరసింహానాయక్, లక్ష్మినారాయణ, కొప్పుల వెంకన్న, సాంబయ్య, లక్ష్మినర్సు, ఉపేందర్, కొప్పుల రాధమ్మ, రవి, మహేష్‌బాబు, ఓరుగంటి యుగేంధర్, కృష్ణ, పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరు కారం
వినోద	సైంధవ్
సాయిరాం	నాసామిరంగ, గుంటూరుకారం
ఆదిత్య	సలార్
శ్రీనివాస	హనుమాన్
సుందర్	హనుమాన్

- ఖమ్మం గాంధీచౌక్

శునకం.. భయానకం..

నగరంలో వీధికుక్కల స్వైరవిహారం

- ఖమ్మంలోని ఏబీసీలో నిలిచిన శస్త్రచికిత్సలు
- దాడులతో నగరవాసులు బెంబేలు
- నియంత్రణపై కేఎంసీ దృష్టి సారించాలని డిమాండ్


ఖమ్మంలోని ఏబీసీ సెంటర్


బ్యాంక్ కాలనీలో వీధి కుక్కల స్వైరవిహారం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధి కుక్కల స్వైరవిహారం పెరిగింది. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తూ చుక్కలు చూపిస్తున్నాయి. ఇటీవలి కాలంలో పెరిగిన కుక్కల సంఖ్యతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో చిన్న పిల్లలు, వృద్ధులపై కుక్కల దాడులకు పాల్పడుతున్నాయి. కుక్కల గుంపు ఉన్న ప్రాంతం మీదుగా పాదచారులు, వాహనదారులు వెళ్లాలంటేనే హడలెత్తుతున్నారు. వాహనాల వెంట పడటం, పాదచారులు వెళ్తుంటే వారిపై దాడికి పాల్పడటం చేస్తున్నాయి. కుక్కలు ఎక్కువగా ఉండే ప్రాంతాల గుండా ప్రయాణం చేయడం కూడా కొందరు మానుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. కుక్కలను నియంత్రించేందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రత్యేకంగా యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ) ఏర్పాటు చేసి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నప్పటికీ కుక్కల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. రోజురోజుకు కొత్తగా పిల్లల సంఖ్య పెరిగి ఏ వీధిలో చూసినా కుక్కల గుంపులు కనిపిస్తున్నాయి.

నిలిచిన స్టెరిలైజేషన్..

ఖమ్మం నగరంలో కుక్కల నియంత్రణకు కేఎంసీ ఆధ్వర్యంలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌ను ఏర్పాటు చేసి అక్కడ శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఓ ప్రైవేటు ఏజెన్సీకి ఏబీసీ నిర్వహణ అప్పగించగా.. కొన్ని రోజులుగా శస్త్ర చికిత్సలు చేయడంలో అవాంతరాలు నెలకొన్నాయి. ఏబీసీ సెంటర్ ప్రారంభించిన తొలి రోజుల్లో 15 కుక్కలకు పైగా శస్త్ర చికిత్స చేయగా.. ఆ తర్వాత వాటి సంఖ్య తగ్గిస్తూ వచ్చారు. నెల రోజులకు పైగా ఈ శస్త్ర చికిత్సలను ఏబీసీ నిర్వాహకులు పూర్తిగా నిలిపివేశారు. శస్త్ర చికిత్సలకు సంబంధించి రూ.10 లక్షల వరకు బకాయిలు ఉండడంతో నిలిపివేసినట్లు తెలుస్తోంది.

4 వేల కుక్కలకు స్టెరిలైజేషన్..

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కుక్కల సంఖ్య భారీగా పెరగడం, పిల్లలు,పెద్దలపై దాడులకు దిగుతుండటంతో నగర ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పలు సందర్భాల్లో కౌన్సిల్ సమావేశాల్లో సైతం ప్రజాప్రతినిధులు, అధికారులకు నగర ప్రజలు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతూ వినతులు అందజేశారు. దీంతో 2021 మార్చి నెలలో కుక్కల నియంత్రణ కోసం ఖమ్మం కార్పొరేషన్‌లో ఏబీసీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడ కుక్కలకు ప్రత్యేకంగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స (స్టెరిలైజేషన్) నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆడ, మగ కలిపి మొత్తం 4 వేలకు పైగా కుక్కలకు స్టెరిలైజేషన్ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇందు కోసం రూ.90 లక్షలు ఖర్చు చేసినట్లు చెప్తున్నారు.

ఏ వీధి చూసినా..

కేఎంసీలో ఏ వీధిలో చూసిన కుక్కల గుంపులు కనిపిస్తున్నాయి. ఖమ్మం కేంద్రంగా ఏబీసీ ఏర్పాటు చేసి శస్త్ర చికిత్సలు చేసినా.. కుక్కల సంఖ్య పెరుగుతుండడంతో నగర వాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శస్త్ర చికిత్సలకు కుక్కలను తీసుకెళ్లి వారం తర్వాత తీసుకొచ్చి వదిలేస్తున్నారు. కొద్ది రోజులకే శస్త్ర చికిత్స చేసిన కుక్కలు కూడా పిల్లలను పెడుతన్నాయని వాపోతున్నారు. ఏబీసీలో శస్త్ర చికిత్సలు సక్రమంగా జరుగుతున్నాయా.. లేదా అనే అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో కొత్తగా కుక్కలు పిల్లలను పెడుతుండడంతో శస్త్ర చికిత్సలపై కేఎంసీలో చర్చ జరుగుతుంది. ఏబీసీ సెంటర్‌పై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ అంశంపై దీనిపై కేఎంసీ అధికారులను వివరణ కోరగా ఏబీసీ సెంటర్‌లో శస్త్ర చికిత్సలు నెల రోజులుగా నిలిచిపోయాయని, రెండు రోజుల్లో పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని, తిరిగి శస్త్ర చికిత్సలు ప్రారంభమవుతాయని తెలిపారు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

ప్రమాదాల నివారణకు నిబంధనలు తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న సీఐ, సిబ్బంది

కూసుమంచి: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కూసుమంచి సీఐ కంది జితేందర్‌రెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం ఖమ్మం - సూర్యాపేట జాతీయ రహదారి టోల్‌ప్లాజా వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అతివేగం, నిర్లక్ష్యంతో వాహనాలను నడపటం వలన ప్రాణాలను పోగొట్టుకోవాల్సి వస్తుందన్నారు. రహదారి ప్రయాణంలో సూచించిన నిబంధనలు పాటించటం వలన క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రమేష్‌కుమార్, మోతె ఏఎస్సై నికోలస్, ఎన్‌హెచ్‌ఏ అధికారులు పద్మ, గోపాలరావు, బాల సుబ్రహ్మణ్యం, ఆదానీ సంస్థ అధికారులు రవికుమార్, సుధాకర్‌రెడ్డి, దినేష్, విజయ్ పాల్గొన్నారు.

సంతాపం


నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ దాల్ మిల్ శాఖ మాజీ అధ్యక్షుడు తేరాల రామారావు(80) అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు చాంబర్ ప్రతినిధులు గురువారం ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్లచెరువు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలంతో పాటు సోమా నర్సింహారావు, మన్నెం కృష్ణ, కైలాసపు వేణుగోపాల్‌రావు, విడాల శ్రీనివాసరావు, కల్వకుంట్ల గోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డ్రైవర్ మృతికి..

ఖమ్మం సహకారనగర్: కలెక్టరేట్‌లోని పౌరసరఫరాల శాఖలో ప్రభుత్వ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న పాపినేని వెంకటేశ్వర్లు మృతిపై తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి హకీం, టి.పంతులు సంతాపం ప్రకటించారు. గురువారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించినట్లు తెలిపారు. నివాళులర్పించిన వారిలో హరినాథరెడ్డి, ఖాజామియా, రాములు, వీరారెడ్డి, వనమా శ్రీనివాస్ పాల్గొన్నారు.

తమ్మినేనికి సీపీఎం నాయకుల పరామర్శ

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను ఖమ్మం జిల్లా సీపీఎం నాయకులు పరామర్శించారు. గురువారం హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రికి వెళ్లిన జిల్లా బృందం తమ్మినేని పరామర్శించి, ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, వై.విక్రమ్, మాదినేని రమేష్, మడుపల్లి గోపాలరావు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థులకు అభినందన


మహేష్‌కుమార్‌గౌడ్‌ను అభినందిస్తున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్‌లను కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాసరెడ్డి అభినందించారు. గురువారం వారిని అసెంబ్లీ ప్రాంగణంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణాలో యువత బాగా కష్టపడి అధిక ఎంపీ సీట్లు గెలిపించేందుకు కృషి చేయాలని తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ అందజేస్తున్న తుమ్మల


రఘునాథపాలెం: మండలంలోని గణేశ్వరానికి చెందిన అజ్మీరా లాస్యశ్రీ మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ రూ.2లక్షల 50 వేల ఎల్‌ఓసీని గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లో చిన్నారి తండ్రి ప్రసాద్‌కు అందించారు. లాస్యశ్రీ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా నిరుపేద కుటుంబానికి చెందిన చిన్నారి వైద్యానికి తక్షణ సాయం అందించాలని చెక్కులు మంజూరు చేయించినట్లు తెలిపారు.

మానవత్వం చాటిన ట్రాఫిక్ పోలీసులు


మహిళను చికిత్స కోసం తరలిస్తున్న పోలీసులు

ఖమ్మంక్రైం: నగరంలోని పాత బస్టాండ్ వద్ద ఒక మహిళ అకస్మాత్తుగా నడుస్తూ పడిపోయింది ఆ సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఖమ్మం ట్రాఫిక్ పోలీసులు శ్రీనివాసరావు, ఒ.సాయిలు హోంగార్డ్ ఆఫీసర్ వీరభద్రం స్పందించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. పోలీసు సిబ్బంది అందించిన సేవలకు గాను ఖమ్మం ట్రాఫిక్ ఏసీపీ సారంగపాణి, సీఐ అశోక్ అభినందించారు.

హార్వెస్ట్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఖమ్మం సహకారనగర్: డాక్టర్ ఏఎస్‌రావు అవార్డ్స్ కౌన్సిల్ 33వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్-2023లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డిలు తెలిపారు. గురువారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని పలు పాఠశాలల 9, 10వ తరగతుల విద్యార్థులు ఖమ్మంలో ఇటీవల నిర్వహించిన 33వ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌లో పాల్గొన్నారన్నారు. పదో తరగతి విద్యార్థి సిహెచ్.కృష్ణమాదూర్ 100 శాతంతో ఉభయ రాష్ట్రాల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా టి.రేవంత్‌కుమార్, కె.ఫణ్విక్ చౌదరి తృతీయ స్థానం, కె.హర్షిత్ 5వ స్థానాన్ని సాధించారన్నారు. ఐఐటీ బ్రాంచ్ ఇన్‌చార్జ్‌లు ఉమా మహేశ్వరరావు, కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


నేలకొండపల్లి: శ్రమదానం చేస్తున్న నాయకులు


తిరుమలాయపాలెంలో..

నేలకొండపల్లి: ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని బీజేపీ నాయకులు కోటి హనుమంతరావు సూచించారు. స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో ప్రధాని మోదీ పిలుపు మేరకు గురువారం మండలంలోని కొత్తకొత్తూరు శ్రీ ప్రసన్నంజనేయస్వామి దేవాలయంలో స్వచ్ఛత కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శులు పాగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, యువ మోర్చా మండలాధ్యక్షుడు తొగాటి నాగచారి, మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు పిట్టల సూరిబాబు, నాయకులు బాజా రామకృష్ణ, పసుపులేటి బజారు, రాము తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని రఘునాథపాలెం గ్రామంలోని శ్రీ భక్త ఆంజనేయ స్వామి దేవస్థానం ఆవరణలో చెత్తాచెదారం తొలగించి గుడి పరిసరాలను శుభ్రం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళ్లపల్లి నరందర్‌రావు, నాయకులు తక్కెళ్లపల్లి హన్మంతరావు, రామడుగు వెంకటేశ్వరరావు, వేణు, గోపాలరావు, భద్రయ్య, నాగరాజు, రాజేష్, కార్తీక్, సంపత్, సంజీవ, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెలుగులకు నిధులు మంజూరు

- నేలకొండపల్లిలో రూ.1.20 కోట్లతో విద్యుత్‌స్తంభాలు
- మార్కింగ్ ఇచ్చిన అధికారులు


డివైడర్‌కు మార్కింగ్ ఇస్తున్న అధికారులు

నేలకొండపల్లి: మండల కేంద్రం నేలకొండపల్లికు విద్యుత్ వెలుగులకు నిధులు మంజూరయ్యాయి. నాలుగు కిలో మీటర్లు మేరా 134 పోల్స్‌కు ఇరువైపులా లైట్లు రింగ్‌రోడ్డులో హైమాస్ట్ వెలుగులు రానున్నాయి. ఇందు కోసం శుక్రవారం విద్యుత్ అధికారులు మార్కింగ్‌ను ఇచ్చారు. మండల కేంద్రం నుంచి చెరువుమాధారం క్రాస్‌రోడ్డు వరకు డివైడర్‌కు ఇరువైపులా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1.20 కోట్లను నిధులు మంజూరు చేసింది. నేలకొండపల్లి నుంచి కొత్తకొత్తూరు, తిరుమలాపురం, చెరువుమాధారం క్రాస్‌రోడ్డు వరకు మొత్తం 134 పోల్స్‌కు 120 వాట్స్ ఎల్‌ఈడీ బల్బులు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) శ్రీనివాస్, వరంగల్ డీఈఈ సబియా సుల్తానా, ఏఈ రాజేష్ మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాస్ మాట్లాడారు.. మరో రెండు రోజులలో పని ని ప్రారంభిస్తామని, ప్రస్తుతం డివైడర్ ఉన్న వరకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామన్నారు.

ఎన్నెస్పీ స్థలాన్ని పరిశీలించిన మాజీ మంత్రి


ఎన్నెస్పీ స్థలాన్ని పరిశీలిస్తున్న రేణుకాచౌదరి

ఖమ్మం వన్‌టౌన్: నగరంలోని బైపాస్ రోడ్డు రామాలయం వద్ద ఎన్నెస్పీ స్థలంలో నిర్మించిన కట్టడాలను కలెక్టర్ ఆదేశాలతో అధికారులు ఇటీవల కూల్చివేశారు. ఈమేరకు ఆ ప్రాంతాన్ని గురువారం కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి పరిశీలించి ఆలయ ధర్మకర్త మోత్కూరి మురళి, అర్చకులతో మాట్లాడారు. కాగా, బస్టాండ్ వెనుక శివాలయం పేరుతో కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించారని స్థానికులు చెప్పగా ముగ్గురు మంత్రులతో మాట్లాడి ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. అలాగే, కాంగ్రెస్ నాయకుడు శెట్టి రంగారావు అన్న సుధాకర్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని రేణుకాచౌదరి పరామర్శించారు. నాయకులు మానుకొండ రాధాకిషోర్, ముస్తఫా, పగడాల మంజుల, ధరావత్ రామ్మూర్తి, వడ్డెబోయిన నర్సింహారావు, కట్ల రంగారావు, దీపక్ చౌదరి, నున్నా రామకృష్ణ, బోడేపూడి రాజా, నల్లమల వేణు పాల్గొన్నారు.

షాపుల తొలగింపునకు చర్యలు


కొత్తలింగాల వద్ద కొలతలు వేస్తున్న ఏఈ వరప్రసాద్, అధికారులు

కామేపల్లి: ఖమ్మం-ఇల్లెందు ప్రధాన రహదారి పండితాపురం, కొత్తలింగాల, కారేపల్లి క్రాస్ రోడ్డులో ఆర్‌అండ్‌బీ రోడ్డుకిరువైపులా 50 అడుగుల లోపు పరిధిలోని షాపులు, ఇతర నిర్మాణ కట్టడాలను తొలగించేందుకు జిల్లా ఉన్నతాధికారుల గురువారం చర్యలు చేపట్టారు. రహదారులపైనే దుకాణదారులు రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు కొనసాగిస్తుండడంతో రోడ్డు ప్రమాదాలకు గురి అవుతున్నారని, ఇలాంటి ప్రమాదాలను నివారించేందుకు గానూ ఆర్‌అండ్‌బీ అధికారులు పూనుకున్నారు. అందులో భాగంగా గురువారం ఆర్‌అండ్‌బీ రోడ్డుకి ఇరువైపులా 50 అడుగుల లోపు మార్కింగ్ వేస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. ఆర్‌అండబీ పరిధిలో ఉన్న దుకాణ యజమానులకు నోటీసులు ఇచ్చి తొలగింపునకు చర్యలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఈ నెల 28న బ్రిలియంట్ సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న ఒలంపియాడ్ రాష్ట్ర స్థాయి పరీక్ష పోస్టర్లను ఎస్‌బీఐటీ చైర్మన్ గుండాల కృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇలాంటి పరీక్షలలో పాల్గొనటం వల్ల విద్యార్థులలో నూతన ఉత్సాహం పెరుగుతుందన్నారు. డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ పరీక్షలో 3 నుండి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

సదస్సు పోస్టర్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: టీజేఎస్ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ కోదండరాం ఆధ్వర్యంలో ఈ నెల 21న రాష్ట్ర విభజన హామీల అమలుపై కేంద్ర ప్రభుత్వ వివక్షతపై ఖైరాతాబాద్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు సదుస్సు పోస్టర్లను గురువారం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ఎదుట ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ బాబు, రంగరాజు, సర్దార్, జంగిపల్లి రవి, నరసింహారావు, నాగేందర్‌రావు, మోహన్ పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి

ఖమ్మం మామిళ్లగూడెం: అద్దంకి దయాకర్‌కి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ యూనిటీ ఆఫ్ మాల, జాతీయ మాల మహానాడు నాయకులు గురువారం జెడ్పీ సెంటర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. నిత్యం కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్న దయాకర్ పార్టీ అధికారంలోకి రావటానికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కనకరాజు, కనకయ్య, ఆనందరావు, ఎల్లయ్య, దయానంద్, శ్రీను, సుందర్‌రావు, రమేష్, ఏలియా, కిరణ్, రాము పాల్గొన్నారు.

మాజీ సీఎంకు ఘన నివాళి


ఖమ్మంఅర్బన్: నివాళులర్పిస్తున్న నాయకులు


కూసుమంచిలో..


ఖమ్మంలో అన్నదానాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఖమ్మంఅర్బన్: మాజీ సీఎం దివంగత నందమూరి తారకరామారావు వర్ధంతిని గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంతో పాటు నగరంలోని పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి వెంకటేశ్వర్లు తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నాయకులు గుత్తా సీతయ్య, వడ్డేం విజయ్, వెంకన్న, నాగేశ్వరరావు, నాగండ్ల మురళి, నరసింహారావు, అప్పారావు, కరుణాకర్, సత్యవతి, రంజిత్, సంపత్, శ్రీనివాసరావు, జయరాం, వెంకటేశ్వర్లు, రామారావు, శ్రీనివాస్, జేమ్స్, స్వాతి, మంగమ్మ, లావణ్య, ఝాన్సీ పాల్గొన్నారు.

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలో నామ ముత్తయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇల్లెందు రోడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకుడు చింతనిప్పు కృష్ణచైతన్య నివాళులర్పించారు. కాల్వొడ్డులో అన్నదానాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈకార్యక్రమాల్లో కనకమేడల సత్యనారాయణ, గుత్తా సీతయ్య, సానబోయిన శ్రీనివాస్‌గౌడ్, సింహాద్రి యాదవ్, తాళ్లూరి శ్రీనివాసరావు, కొడకంటి ఆంజనేయులు, యల్లంపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లిలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూక హనుమంతరావు ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మరికంటి రమేష్, మల్లేబోయిన శ్రీనివాసరావు, నూక నాగయ్య, భూషణం, లక్ష్మణరావు, వెంకట్, కోటయ్య, పిచ్చయ్య పాల్గొన్నారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పావులూరి వెంకటేశ్వరరావు, ఎస్.మల్లయ్య, వెంకట సీతారాంబాబు పాల్గొన్నారు.

కూసుమంచి: కూసుమంచిలో టీడీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కామేపల్లి: కొత్తలింగాల గ్రామంలో టీడీపీ శ్రేణులు టీడీపీ జెండాను ఎగురవేసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. తోటకూరి ఉపేందర్‌రావు, నరసింహారావు, పెద్దవీరయ్య, కిలారు కృష్ణయ్య, చైతన్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: ఎన్టీఆర్ విగ్రహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ పూలమాల లేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఉప్పల శారద, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్, మంద సరస్వతి, శ్రీనివాస్, ఉపేందర్, డీకొండ శ్యామ్, సురేష్ పాల్గొన్నారు.

ఖమ్మంవన్‌టౌన్: నగరంలోని బైపాస్‌రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పూలమాల వేసి ఘనంగా నివాలర్పించారు. కాంగ్రెస్ నగర కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జావీద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, పీసీసీ సభ్యుడు నాగేశ్వరరావు, మిక్కిలినేని నరేందర్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ముజాహిద్, అనిల్‌కుమార్ తదితరులున్నారు.